# నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## – అదుపు తప్పి బైకును ఢీకొట్టిన కారు ఐదుగురు దుర్మరణం

నల్గొండ సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నల్గొండ జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండలం నర్సర్లపల్లి వద్ద బుధవారం సాయంత్రం కారు అదుపు తప్పి బైకును ఢీకొట్టింది. ఆ తర్వాత కారు సైతం రోడ్డుపై పల్టీలు కొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురితో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు సైతం ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. మద్దిగూడ ప్రసాద్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన భార్య రమణమ్మ, కొడుకు అవినాష్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో చింతపల్లి వద్ద కారు ఢీకొట్టింది. అనంతరం కారు సైతం బోల్తాపడింది.ప్రమాదంలో తండ్రీ కొడుకులు ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడ్డ వారిని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మార్గంమధ్యలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతులను మద్దిమడుగు ప్రసాద్ (38), మద్దిమడుగు రమణమ్మ (35), మద్దిమడుగు అవినాష్ (12), పట్నపు మణిపాల్ (18) వనం మల్లికార్జున్ (12)గా గుర్తించారు. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడగా వారికి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కుష్టు వ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన: సాయి చౌదరి



వికారాబాద్ సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నిర్లక్ష్యానికి గురైన ఉష్ణ మండల వ్యాధుల్లో కుష్టు సైతం ఒకటి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు దారూర్ లో ఇంటి ఇంటికి తిరిగి లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఒఅఆఅ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి చౌదరి మాట్లాడుతూ మైకో బాక్టీరియం లేప్రే అనే సూక్ష్మజీవి ద్వారా సోకే ఈ అంటువ్యాధి 120 దేశాలను పట్టి పీడిస్తుందని, కుష్టు ప్రారంభములో శరీరముపై లేత రంగులో మచ్చలు ఏర్పడి వాటిపై గుచ్చినప్పుడు ఎలాంటి స్పర్శ ఉండదని, వెంటనే వైద్యం చేయించుకోకుంటే వ్యాధి ముదిరి అందత్వము, చేతులు, కాళ్ల వైకల్యానికి దారితీసాయని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. ఇండియాలో 2007లో 1,37,000 వేల కొత్త లెప్రసీ కేసులో నమోదయాయి. 2016లో వాటి సంఖ్య 1,35,000. అంటే 9 ఏళ్లలో వ్యాధి తీవ్రతలో పెద్దగా మార్పు ఏమి లేదని, కుష్టు వ్యాప్తి పై 2016లో భారత లెప్రసీ డైరెక్టర్ జనరల్ కార్యాలయం సైతం ఆందోళన వ్యక్తం చేసింది. దేశీయంగా వెలుగులోకి రాని కుష్టు కేసులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు భారత వైద్య పరిశోధనా మండలి సర్వేలో తేలిందని, సరైన అవగాహన లేకపోవడంతో, చాలామంది తమకు కుష్టు సోకినట్లు తొలిదశలోనే నమోదు చేసుకోవడం లేదు. పైగా 2005 తర్వాత వ్యాధి నిర్ధారణ మందగించి బాధితుల్లో తీవ్ర వైకల్యాలు అధికమయ్యాయి. ఈ క్రమంలో 2018 నాటికి లెప్రసీని నిర్మూలించి ఆ స్థితిని కొనసాగించాలని జాతీయ వైద్య విధానం-2017న సూచించింది. ఇండియాలో 2021 లో లెప్రసీ వల్ల 18 వందల మందికి పైగా తీవ్ర వైకల్యాల బారిన పడ్డారు అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. ముందుగా లెప్రసీ వ్యాధి పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. వైద్య బృందాల సాయంతో తొలిదశలోనే బాధితులను గుర్తించి సరైన చికిత్స ద్వారా శారీరక వైకల్యాన్ని నివారించాలని సాయి చౌదరి అన్నారు

# రాజ్యాంగం కొత్త కాపీల్లో సోషలిస్టు, సెక్యూలర్ పదాలు లేవు

## –కాంగ్రెస్ ఎంపీ అధిర రంజన్ చౌదరీ



న్యూఢిల్లీ సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సం సందర్భంగా జరిగిన సమావేశాల సమయంలో.. ఎంపీలకు కొత్త రాజ్యాంగం పుస్తకాలను అందజేశారు. అయితే ఆ రాజ్యాంగ కాపీల్లో .. సోషలిస్టు, సెక్యులర్ అన్న పదాలు లేవని కాంగ్రెస్ ఎంపీ అధిర రంజన్ చౌదరీతెలిపారు. సెంట్రల్ విస్టాలో ఎంటర్ అవుతున్న నేపథ్యంలో కొత్త రాజ్యాంగ కాపీలను అందజేశారని, కానీ ఆ పుస్తకాల్లో ఉన్న పీఠికలో సోషలిస్టు సెక్యూలర్ పదాలు లేవని అధిర్ ఆరోపించారు. సామ్యవాదం(సోషలిస్టు), లౌకికవాదం(సెక్యూలర్) పదాలు.. రాజ్యాంగ పీఠికలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 1976లో రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాలను పీఠికలో జోడించామన్నారు. కానీ ఇప్పుడు ఉన్న రాజ్యాంగ పుస్తకంలో ఆ పదాలు లేవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్దేశం అనుమానాస్పదంగా ఉందని, చాలా తెలివిగా ఈ పనిచేశారని ఆయన ఆరోపించారు. ఈ అంశాన్ని లేవనెత్తాలని చూశానని, కానీ తన అభ్యర్థనను పట్టించుకోలేదని ఆయన అన్నారు. భారత్ అన్నా.. ఇండియా అన్నా ఒక్కటేనని, పేరు కోసం రాద్దాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం రెండు పేర్లలో తేడాలేదన్నారు.

# ఢిల్లీ యూనివర్సిటీలో డిజిటల్ ఇండియా టాక్ షో కమ్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:ఢిల్లీ యూనివర్సిటీలో డిజిటల్ ఇండియా టాక్ షో కమ్ ఇంటరాక్టివ్ సెషన్ విజయవంతంగా నిర్వహించబడింది. రాబోయే 6 నెలల్లో ప్లాన్ చేసిన వర్క్ షాప్‌ల శ్రేణిలో ఇది రెండవది. ఇది డిజిటల్ ఇండియా అవేర్‌నెస్ ప్రచారంలో భాగంగా నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ (ఎన్ఇజిడి), మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఇఐటివై) ద్వారా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, వర్సిటీ సిబ్బందితో పాటు యూనివర్సిటీకి చెందిన 500 మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం ఎన్ఇజిడి మరియు డియులకు చెందిన అధికారులు కీలక ప్రసంగాలు చేశారు.

ఎంఇఐటివై ఎన్ఇజిడి డైరెక్టర్ శ్రీ జె ఎల్ గుప్తా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ప్రోగ్రామ్ యొక్క లక్ష్యాలను మరియు దేశంలోని డిజిటల్ పరివర్తనను ఎలా తీసుకువస్తున్నాయో దాని యొక్క ముఖ్య కార్యక్రమాలు అలాగే దేశంలోని సుదూర ప్రాంతాలకు మరింత మెరుగ్గా చేరుకోవడంలో ఏ విధంగా సహాయపడుతున్నాయన్నదానిపై వివరించారు.

ఢిల్లీ యూనివర్శిటీ కంప్యూటర్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంజీవ్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయాల మధ్య సహకారం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. అందరికీ ప్రయోజనాలను బాగా అర్థం చేసుకోవడానికి మరియు చొచ్చుకుపోయేలా చేసిందని తెలిపారు. డిజిలాకర్, నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడి) మరియు అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబిసి) వంటి కార్యక్రమాల కోసం ఎంఇఐటివైతో యూనివర్సిటీ కలిగి ఉన్న వివిధ సహకారాల గురించి కూడా ఆయన పంచుకున్నారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ (ఐఎల్ఎల్ఎల్) డైరెక్టర్ ప్రొ.సంజోయ్ రాయ్ విద్యార్థుల జీవితాల్లో డిజిటలైజేషన్ ప్రయోజనాలు మరియు డిజిటల్ ప్రపంచంలో నైతికత యొక్క ఆవశ్యకత గురించి మాట్లాడారు.

ఐదు కీలక డిజిటల్ ఇండియా కార్యక్రమాలైన ఉమాంగ్, డిజిలాకర్, నేషనల్ అకడమిక్ డిపాజిటరీ - అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎన్ఏడి-ఏబిసి), సైబర్ సెక్యూరిటీ, మైస్కీమ్ మరియు యూఎక్స్4జి వంటి అంశాలపై నిపుణులచే ఎంగేజింగ్ సెషన్‌లు నిర్వహించారు.

వర్క్‌షాప్ యొక్క ముఖ్యాంశాలలో ఒకటి ఇంటరాక్టివ్ డిజిటల్ ఇండియా క్విజ్. ఇందులో ఐదు ప్రాజెక్ట్‌లకు సంబంధించిన బహుళ ఎంపిక ప్రశ్నలు అడిగారు; విద్యార్థులు మరియు డియు ప్రొఫెసర్లు ఇరువురు చాలా ఉత్సాహంతో క్విజ్‌లో పాల్గొన్నారు. మరియు విజేతలకు డిజిటల్ ఇండియా గూడీస్ మరియు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

# రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

హైదరాబాద్ సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి గారికి రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ సీనియర్ అడ్వైజర్ కమిటీ సభ్యులు బెజవాడ సుబ్బలక్ష్మమ్మ, డా. సుప్రియ గారి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ఐటి మినిస్టర్ మేకపాటి గౌతంరెడ్డి తల్లిగారు మేకపాటి మనీ మంజరి హైదరాబాద్ జిల్లా శాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి కొరకు 50,000 రూపాయలు విరాళం అందించారు. పేదల అభ్యున్నతి కోసం మరియు జన ఔషధీ షెటర్స్ నిర్మాణం కొరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ భీమ్ రెడ్డి గారు బ్లడ్ బ్యాంక్ అభివృద్ధి నిర్మాణం కొరకు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తన వంతుగా విరాళం అందించిన మనీ మంజరి గారికి సుబ్బలక్ష్మమ్మ గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# కల్తీపాలు తయారు చేస్తున్న ఇండ్లపై పోలీసులు దాడి

## –తయారీకి వాడే పదార్థాలను స్వాధీనం..ఇద్దరి అరెస్ట్

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కల్తీపాలు తయారు చేస్తున్న ఇండ్లపై పోలీసులు దాడి చేసి తయారీకి వాడే పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కుల, భీమనపల్లి గ్రామాల్లో బుధవారం ఈ ఘటన వెలుగుచూసింది. స్థానిక ఎస్ఐ విక్రంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భీమనపల్లి గ్రామానికి చెందిన కప్పల రవి కల్తీపాలను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో పోలీసులు రవి ఇంటిని తనిఖీ చేశారు. ఈ మేరకు అతని వద్ద 350 లీటర్ల కల్తీ పాలు, 100 మిల్లీమీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్ , 2 డోలోఫర్ సిమ్డ్ మిల్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కనుముకుల గ్రామంలో కుంభం రవి ఇంటి వద్ద వంద లీటర్ల కల్తీ పాలు, 200 మిల్లీలీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 2 డోలోఫర్ సిమ్డ్ మిల్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కల్తీ పాలను పరీక్షల నిమిత్తం ల్యాబరేటరీకి పంపించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# అండమాన్ & నికోబార్ కమాండ్‌ను సందర్శించిన రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:అండమాన్,ఉ నికోబార్ దీవులకు తన రెండు రోజుల పర్యటనలో భాగంగా రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్ అండమాన్ ఉ నికోబార్ కమాండ్ (ఎఎన్‌సి) కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన పర్యటన 18 సెప్టెంబర్ 2023న ముగిసింది. కేంద్ర కార్యాలయ పర్యటనలో భాగంగా రక్షణ శాఖ సహాయ మంత్రి ఎఎన్‌సి కమాండర్ ఇన్ చీఫ్ ఎయిర్ మార్షల్ సాజు బాలకృష్ణన్‌తో సమగ్ర సంభాషణలు, కార్యనిర్వహణకు సంబంధించిన చర్చలు కూడా జరిగాయి. తన పర్యటన సందర్భంగా, శ్రీ అజయ్ భట్ అనేకమందితో సంభాషించడం అన్నది ఈ సుందరమైన ద్వీపకల్పపు వ్యూహాత్మక ప్రాముఖ్యతను సూచిస్తుంది.

ఐఎన్ఎస్ ఉత్కర్ష్‌లో సంకల్ప స్మారక వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు అర్పించడం ద్వారా రక్షణశాఖ సహాయ మంత్రి తన పర్యటనను ప్రారంభించారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డికె జోషి (రిటైర్డ్)తో రాజ్‌నివాస్‌లో గౌరవపూర్వకంగా సమావేశం అయ్యారు.

# ఒంటి చేత్తో దేశాలను పాలిస్తున్న మహిళా నాయకులు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తొమ్మిది నెలలలో ఓ బిడ్డకు ప్రాణంపోయగల శక్తి స్త్రీకి ఉంది. కానీ, చట్టసభలలో ఆమె ప్రాతినిధ్యానికి ఉద్దేశించిన బిల్లు మాత్రం మూడు దశాబ్దాలు గడిచినా చట్టరూపం దాల్చలేదు. మొత్తానికి గ్రహణం వీడింది. లోక్‌సభ ఆమోదం పొందింది. అయినా, మహిళ పాలన మనకు కొత్తేం కాదు. తరాలుగా తన నాయకత్వ ప్రతిభను నిరూపించుకుంటూనే ఉన్నదామె. స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడిన మొట్టమొదటి క్యాబినెట్‌లో మంత్రిగా కొలువైన అమృత కౌర్ నుంచి ఇప్పటి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వరకు చాలామంది మగువలు దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఇక విశ్వ మహిళలు ఇందిరాగాంధీ, మార్గరెట్ థాచర్, అంగ్‌సాన్ సూకీ, బెనజీర్ భుట్టో తమదైన ముద్రతో అంతర్జాతీయ సమాజాన్ని ప్రభావితం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళా దేశాధ్యక్షులను కూడా తలుచుకుని తీరాలి.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, సెప్టెంబర్ 21:తెలంగాణ సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యజించిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ. 90 సంవత్సరాల వయసులో తెలంగాణ సాధన కోసం గడ్డకట్టే చలిలో ఢిల్లీలో ఉద్యమం చేసిన ఘనత ఆయనది. ఆ మహనీయుడి సేవలు తెలంగాణకే గర్వకారణమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌అన్నారు.

భారత స్వాతంత్ర పోరాట, తెలంగాణ ఉద్యమ నేత, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కరీంనగర్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవల్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ. తన జీవితాంతం బలహీన వర్గాల కోసం సేవ చేసిన ఘనత ఆయనదని ప్రశంసించారు. ఆయనతో పాటు తెలంగాణ ఉద్యమంలో నేను పాల్గొనడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఆయన కండ్లతో చూడకపోవడం బాధాకరమన్నారు. బాపూజీని గౌరవించుకుంటే మనల్ని మనం గౌరవించుకున్నట్టేనని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. గాలి, నీరు ఉన్నంత వరకు కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక్క కులానికో.. మతానికో చెందిన వారు కాదని, ఆయన యావత్ తెలంగాణకే ఆస్తి అని అన్నారు.

# దేశవ్యాప్తంగా విద్యార్థుల కోసం 6467 స్టాండర్డ్ క్లబ్‌లను ఏర్పాటు చేసిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:దేశవ్యాప్తంగా పాఠశాలలు మరియు కళాశాలల్లో 6467 స్టాండర్డ్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు జాతీయ స్థాయిలో ప్రమాణాల అమలు కోసం కృషి చేస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ( బిఐఎస్) ప్రకటించింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచే అంశంలో ప్రమాణాల ప్రాముఖ్యతపై యువతకి అవగాహన పెంపొందించే లక్ష్యంతో స్టాండర్డ్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్టు బిఐఎస్ పేర్కొంది.

“బలమైన, శక్తివంతమైన, చైతన్యవంతమైన భారతదేశం నిర్మాణంలో పిల్లలు వాస్తుశిల్పులుగా ఉంటారు. భారతదేశ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా పాఠశాలలు,కళాశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. యువ మనస్సులలో నాణ్యత, ప్రమాణాలు, శాస్త్రీయ అంశాల పట్ల అవగాహన కల్పించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చి దిద్దడం లక్ష్యంగా “స్టాండర్డ్స్ క్లబ్‌లు'' ఏర్పాటు అవుతాయి. వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి సాధించడానికి నాణ్యత పట్ల స్పృహ, ప్రామాణీకరణ సూత్రాల అవగాహన కీలక అంశాలుగా ఉంటాయి. స్టాండర్డ్స్ క్లబ్‌ల ద్వారా నాణ్యత, ప్రమాణాలు, ప్రామాణీకరణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి సమాజాభివృద్ధికి అవసరమైన వనరులను అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతుంది.” అని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తెలియజేసింది.

2021లో స్టాండర్డ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయడానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రణాళిక సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా 6,467 పాఠశాలలు, కళాశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌లను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఏర్పాటు చేసింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఏర్పాటు చేసిన స్టాండర్డ్స్ క్లబ్‌లలో సైన్స్ నేపథ్యం గల 1.7 లక్షల మందికి పైగా విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు బిఐఎస్ ద్వారా ప్రత్యేక శిక్షణ పొందిన సంబంధిత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల స్థాయిలో 5,562 స్టాండర్డ్స్ క్లబ్‌లు, కళాశాల స్థాయిలో 905 క్లబ్‌లు, ఇంజినీరింగ్ కాలేజీల్లో 384 క్లబ్‌లు ఏర్పాటు అయి పనిచేస్తున్నాయి.

“ యువ ప్రతిభావంతులకు నాణ్యత, ప్రామాణీకరణ రంగాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందించే విధంగా క్లబ్బులు ఏర్పాటు అయ్యాయి. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్లబ్బులు వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఆయా పాఠశాల/కళాశాల ద్వారా బిఐఎస్ అందిస్తోంది. స్టాండర్డ్ క్లబ్‌ల నిర్వాహకులకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి, విద్యార్థుల సభ్యుల ల్యాబ్‌లు, పరిశ్రమ విభాగాలను సందర్శించి క్షేత్ర స్థాయిలో అవగాహన పొందేలా చూసేందుకు సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు” అని బిఐఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

“ప్రాక్టికల్ లెర్నింగ్ ప్రాముఖ్యతను గుర్తించిన బిఐఎస్ ఆర్థిక సహాయాన్ని మరింత ఎక్కువ చేసింది. . స్టాండర్డ్స్ క్లబ్‌లు కలిగిన ఉన్నత, హయ్యర్ సెకండరీ అర్హత గల ప్రభుత్వ పాఠశాలలు గరిష్టంగా వన్-టైమ్ లాబొరేటరీ గ్రాంటుగా 50,000/- పొందుతాయి. సైన్స్ ల్యాబ్‌లను అప్‌గ్రేడ్ చేయడానికి అత్యాధునిక ల్యాబ్ పరికరాల ఏర్పాటుకు ఈ గ్రాంటు ఉపయోగపడుతుంది” అని బిఐఎస్ వివరించింది.

“అభ్యాస వాతావరణం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా జరిగేలా చూసేందుకు బిఐఎస్ 1,00,000 రూపాయల వరకుఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. స్టాండర్డ్స్ క్లబ్‌లు ఏర్పాటైన ప్రభుత్వ సంస్థలలో ‘ప్రామాణిక తరగతి గది’ని అభివృద్ధి చేయడానికి ఈ నిధులు సహకరిస్తాయి. ఈ కార్యక్రమం కింద పాఠశాలలోని ఒక గదిలో స్మార్ట్ టీవీలు, ఆడియో వీడియో సిస్టమ్‌లు, సరైన వెలుతురు, గోడలను అలంకరించడం మొదలైన ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తారు. పునరుద్ధరించబడుతుంది. భవిష్యత్తు నాయకుల పెరుగుదలను పెంపొందించడానికి, ఉత్సుకత కలిగించడానికి ఆవిష్కరణల పట్ల ఆకర్షితులు అయ్యే విధంగా కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి అని బిఐఎస్ పేర్కొంది.

“నాణ్యత ప్రమాణాల అమలుకు కృషి చేస్తున్న బిఐఎస్ యువతకు నాణ్యత, ప్రమాణాల పట్ల అవగాహన పెంపొందించి నవ భారతదేశం నిర్మాణానికి సహకారం అందిస్తోంది. దూరదృష్టితో బిఐఎస్ అమలు చేస్తున్న కార్యక్రమాలు నాణ్యత, ప్రమాణాలను ప్రోత్సహించడవే కాకుండా బాధ్యతాయుతమైన, నాణ్యతపై స్పృహ కలిగిన పౌరులుగా మారడానికి యువ తరానికి అవకాశం కల్పిస్తుంది.” అని బిఐఎస్ వివరించింది.

# భారీగా పతనమయిన దేశీయ స్టాక్ మార్కెట్లు

ముంబై సెప్టెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్) దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా పతనమయ్యాయి. బుధవారం స్వల్ప నష్టాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పవనాలతో.. దేశీయ మార్కెట్లలో బుధవారం భారీగా అమ్మకాలు కనిపించాయి. ఈ క్రమంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్లు తగ్గి 67వేల మార్క్ దిగువకు పడిపోయింది. ట్రేడింగ్‌లో 66,728 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. అదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 238 పతనమై 19,895 పాయింట్లకు చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 796 పాయింట్లు తగ్గి 66,800.84 పాయింట్ల వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 231.90 పాయింట్లు పతనమై 19,901.40 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.95 లక్షల కోట్లు తగ్గి రూ.320.04 లక్షల కోట్లకు చేరింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మీటింగ్ ఫలితాల కంటే ముందే యూఎస్ బాండ్లు బుధవారం దిగువ మొదలయ్యాయి. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన స్టాక్స్‌లో నష్టాలు 16 సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు క్షీణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనం తర్వాత జూలై ఒకటి నుంచి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగే అవకాశం ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సోమవారం ప్రకటించింది. అయితే, బుధవారం హెచ్‌డీఎఫ్‌డీ షేర్లు మూడుశాతం వరకు పతనమయ్యాయి. వాస్తవానికి హెచ్‌డీఎఫ్‌సీ విలీన ఒప్పందం తర్వాత కంపెనీ షేర్లు మూడుశాతం వరకు పెరిగాయి.ట్రేడింగ్‌లో దాదాపు 1,510 షేర్లు పురోగమించగా.. 2,034 షేర్లు క్షీణించాయి. 137 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీసీఎల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎక్కువగా నష్టపోగా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, సన్ ఫార్మా, ఐషర్ మోటార్స్ లాభపడ్డాయి. సెక్టార్లలో, పవర్ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు బ్యాంక్, మెటల్ మరియు రియాల్టీ ఒక్కొక్కటి 1 శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.30 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం క్షీణించాయి.

# రోడ్ ప్రమాదంలో నిట్ విద్యార్థిని మృతి



హన్మకొండ, సెప్టెంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా జంగాలపల్లి మండలం క్రాస్ రోడ్ వద్ద గురువారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ నిట్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ కు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముర్తుజా (హైదరాబాద్), ఉమర్ (హైదరాబాద్) సాయి (హైదరాబాద్), శ్రేయ (విజయవాడ), సుజిత్ (హైదరాబాద్) అనే ఐదుగురికి గాయాలయ్యాయి. మరో విద్యార్థిని తాడేపల్లి నిస్సి సిజు (ఏలూరు ? 18 ఎవజీతీబ)- (ఃఎవఇష్ట్ర అతిలతిశ్రీ ఎఎ జవజీతీ) అనే విద్యార్థిని మృతి చెందారు. వీరంతా బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్ లో ములుగు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి ప్రధమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించారు. ఆ తర్వాత నలుగురు విద్యార్థులను రోహిణి హాస్పిటల్ లో చేర్చగా, ఒక విద్యార్థి(సాయి) ని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# మళ్లీ ఉల్లిగడ్డల సంక్షోభం?

నాసిక్, సెప్టెంబర్ 21: మహారాష్ట్రతోపాటు దేశవ్యాప్తంగా ఉల్లిగడ్డల సంక్షోభం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్లో ఉల్లి సరఫరా తగ్గి ధరలు కొండెక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉల్లిగడ్డలు సరఫరా చేసే నాసిక్‌లో తిరిగి వేలం పాటలు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడనుంది.

నాసిక్ ఉల్లిగడ్డ వ్యాపారులు తాజాగా బుధవారం ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. నాసిక్ జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో వేలంను నిలిపివేస్తున్నామని, తమ ఆందోళనలు నిరవధికంగా కొనసాగుతాయని చెప్పారు. ఉల్లిగడ్డ ఎగుమతులపై సుంకాన్ని 40 శాతం పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన జరుపుతున్నట్టు నాసిక్ డిస్ట్రిక్ట్ ఆనియన్ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీఓటీఏ) తెలిపింది.కేంద్రం నిర్ణయం వల్ల అటు ఉల్లిగడ్డ ఎగుమతి దారులే కాక రైతులు సైతం తీవ్రంగా నష్టపోతున్నారని, అందుకే దీనిని ఉపసంహరించుకునే వరకు జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీలలో వేలాన్ని నిరవధికంగా నిలిపివేస్తున్నట్టు అసోసియేషన్ స్పష్టం చేసింది. కాగా, ఆందోళన చేసే వ్యాపారుపై తగు చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అబ్దుల్ సత్తార్ హెచ్చరించారు. వ్యాపారుల నిర్ణయం సరైంది కాదని పేర్కొన్న ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనకు దిగుతున్న వ్యాపారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని నాసిక్ కలెక్టర్‌ను ఆదేశించారు.

